క్లుప్తంగా

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి, గొల్లపాలెం గ్రామాలకు విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం సోమవారం కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

మంగళగిరిటౌన్: మంగళగిరి పట్టణ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ దృష్ట్యా సోమవారం పలుప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఆ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని కొప్పురావు కాలనీ, భార్గవపేట, దేవుడి మాన్యం, బాప్టిస్ట్ పేట, ఎన్‌సీసీ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం మిస్సింగ్ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ రవీంద్రనాయక్ తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలోని డ్రైవర్ పేటకు చెందిన మహమ్మద్ ఇలియాస్ కార్ల వ్యాపారం చేస్తుంటాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. 19 ఏళ్ల చిన్న కుమారుడు మహ్మద్ రజాక్ ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం వరకు చదువుకున్నాడు. చదువు మానివేసి ఇంటివద్దే ఉంటున్నాడు. గత నెల 21వ తేదీన ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లి వస్తానని చెప్పాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులను అడిగినా ఎక్కడా ఆచూకీ దొరకలేదు. రజాక్ ఇంట్లో నుంచి వెళ్లే సమయంలో కాఫీ కలర్ టీ షర్టు, బ్లూ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, ఎత్తు 5.10 ఉంటాడని, కర్లింగ్ హెయిర్ ఉన్నట్లు తండ్రి ఇలియాస్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కార్మిక సమస్యలను పరిష్కరించండి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ కోరారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా కార్మికుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీని మంత్రి నారా లోకేష్ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో జీలగ వెంకటేశ్వర్లు, బి. సూర్య ప్రకాష్, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు, గురవయ్య, అంకయ్య, జానీ బాష, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని మెల్లెంపూడిలో ఆదివారం గ్యార్మీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెల్లెంపూడిలోని జెండా జెట్టు వద్ద జెండాలతో పలువురు ముస్లింలు ఊరేగించారు. ఆ ప్రాంతాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లింలు మాట్లాడుతూ గ్యార్మీ ముఖ్యంగా మహబూబ్ సుభాని జీవిత చరిత్రను, వారిబోధనలను గుర్తుచేసుకునే పండుగ అని పేర్కొన్నారు. పలువురు ముస్లిం పెద్దలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు.

వీధి కుక్కలను సంరక్షణ కేంద్రాలకు తరలింపు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని సమస్యాత్మక ప్రాంతాల్లో వీధి కుక్కలను పట్టుకుని బుర్రిపాలెం రోడ్డులోని సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా ఏసుబాబు పేర్కొన్నారు. చెంచుపేట, అమరావతి ప్లాట్స్‌లో ఆదివారం కుక్కలను సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో కుక్కలపై ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయన్నారు. వాటి నియంత్రణ కోసం ప్రత్యేక వాహనాన్ని సిద్ధం చేసి దానిలో వాటిని సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నట్లు చెప్పారు.

చెక్కుల పంపిణీ


తెనాలిఅర్బన్: సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు వైద్య భరోసా లభిస్తుందని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. తెనాలి నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న వారికి బోసురోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32మంది లబ్ధిదారులకు రూ.19,24,524 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు.

అంగరంగ వైభవంగా..

- బేతాళ సెట్లతో గ్రామోత్సవం
- పోటాపోటీగా లడ్డూపాటలు
- తెల్లవారుజామున కృష్ణానదిలో నిమజ్జనం



బేతాళ సెట్టులతో నిర్వహిస్తున్న గ్రామోత్సవం



ఉండవల్లిలో ప్రత్యేక వాహనంపై అలంకరించిన అమ్మవారు



ఉండవల్లిలో లడ్డూ దక్కించుకున్న కొల్లు చంద్రశేఖర్‌రెడ్డి

తాడేపల్లి రూరల్: దేవీ నవరాత్రుల సందర్భంగా తాడేపల్లి రూరల్‌లోని పలు ప్రాంతాల్లో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి ఆదివారం తెల్లవారుజామున కృష్ణానదిలో నిమజ్జన కార్యక్రమం చేశారు. ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద శ్రీ కనకదుర్గ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవాకి గ్రామోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి వద్ద గ్రామానికి చెందిన కొండనాగమోహన్ రెడ్డి ఇచ్చిన 50 కేజీల లడ్డూను గ్రామస్తుడు కొల్లి చంద్రశేఖర్‌రెడ్డి రూ. 1,20,000కు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూ.50 వేల మణిహారాన్ని అదే గ్రామానికి చెందిన ప్రల్లపోలు నాగిరెడ్డి రూ. 80 వేలకు పాడుకున్నారు. చిర్రావూరు గ్రామంలో కనకదుర్గమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా నవరాత్రులు శనివారంతో ముగియడంతో రాత్రి సమయంలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గ్రామోత్సవానికి ముందుగా వీరిశెట్టి శ్రీనివాసరావు, తమ్మిశెట్టి రాజా ఇచ్చిన లడ్డూను అదే గ్రామానికి చెందిన అన్నపురెడ్డి నవీన్‌రెడ్డి, ఆయన స్నేహితులు వీరిశెట్టి సాంబయ్య, బోయిన కోటయ్య, పోకల రాంబాబు రూ. 1,11,000కు దక్కించుకున్నారు. ఉండవల్లి రెడ్ల రామమందిరం వద్ద గ్రామోత్సంలో అమ్మవారి ప్రతిరూపాలతో బేతాళ సెట్లు ప్రత్యేక అలంకరణగా నిలిచాయి.

ఇదేనా స్వచ్ఛత?

ఫొటోలకు ఫోజులతో సరి



తాడికొండలో ఘనవ్యర్థాల నిర్వహణ ప్లాంటు వద్ద పేరుకుపోయిన చెత్త

తాడికొండ: మేజర్ పంచాయతీ దాదాపు 40 వేల జనాభా కలిగిన తాడికొండలో పారిశుద్ధ నిర్వహణ నామమాత్రంగా సాగుతోంది. స్వచ్ఛతా హీ సేవా పేరుతో ప్రతివారం ఫొటోలకు ఫోజులిచ్చే అధికారులు, ప్రజా ప్రతినిధులు అందుకు తగిన రీతిలో చర్యలు తీసుకోవడం లేదు. ఇందుకు ఉదాహరణగా నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ అయిన తాడికొండ నిలుస్తుంది. గ్రామంలో అరకొరగా ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో చెత్త తొలగింపు, మురుగు తీయడం పూర్తిస్థాయిలో జరగడం లేదు. ప్రధానంగా హోటళ్లు, ఇతర దుకాణాల వద్ద మాత్రమే చెత్త ఏరివేత, సేకరణ చేస్తూ శివారు ప్రాంతాల్లో మాత్రం వారానికి ఒకసారి మాత్రమే సిబ్బంది తొంగిచూస్తున్నారు. దీంతో ప్రధాన రహదారుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీనికి తోడు తొలగించిన చెత్తను ఘన వ్యర్థాల ప్లాంటుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఆ దిశగా ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంటులో నామమాత్రంగా వేసిన మట్టి కుప్పలు నిత్యం దర్శనమిస్తున్నాయి. ఒక్క కిలో సేంద్రియ ఎరువు అమ్మిన దాఖలాలు లేకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందిది. భారీగా పోగైన చెత్త కుప్పలను జేసీబీతో కొండకు ఆనించి పక్కకు నెట్టి నిప్పు పెడుతుండటం పరిపాటిగా మారడంతో అది వాతావరణ కాలుష్యానికి దారితీస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి సంపూర్ణ పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవడంతో పాటు చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారీకి చర్యలు తీసుకొని ఆదాయం సృష్టించాలని పలువురు కోరుతున్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి



నిరసన కార్యక్రమంలో కేవీపీఎస్ నేతలు

తాడేపల్లి రూరల్: అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు. ఆదివారం తాడేపల్లి రూరల్ గుండిమెడలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకు ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తాను ప్రధానిని అయ్యానని చెప్పుకునే నరేంద్రమోదీ రాజ్యాంగబద్ధంగా పరిపాలన సాగించడం లేదని విమర్శించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చర్యలు తీసుకుంటోందని మండిపడ్డారు. బడ్జెట్‌లో, నిధుల కేటాయింపులో దళితులకు, గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. చిత్తూరు జిల్లాలో జరిగిన దుర్మార్గమైన ఘటనకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, నేతలు జోషి, నాగపోగు విజయరాజు, బత్తుల సంసోన్, ఎం. చిన్న, తంబి, ఏసురత్నం, చిన్నప్ప, కృష్ణ, పవన్ తదితరులు పాల్గొన్నారు.

రెండు లేగదూడలకు జన్మనిచ్చిన గోమాత



ఒకే కాన్పులో రెండు దూడలకు జన్మనిచ్చిన గోమాత



లేగదూడలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కుంచనపల్లిలో ఓ గోశాలలో ఓ గోమాత ఆదివారం రెండు లేగదూడలకు జన్మనిచ్చింది. నిర్వాహకులు బొంతు శ్రీనివాసరెడ్డి (అరవింద శ్రీనివాస్‌రెడ్డి) తెలిపిన వివరాల ప్రకారం తాను నిర్వహిస్తున్న గోశాలలో ఒకే కాన్పులో రెండు కోడెదూడలకు ఓ గోమాత జన్మనిచ్చిందని, అలా జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. రెండు దూడలు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారన్నారు. తాడేపల్లి పశు వైద్యులు సురేష్ మాట్లాడుతూ జన్యులోపంతో వచ్చే మార్పుల కారణంగా లేగదూడలు ఇలా పుట్టాయని తాడేపల్లి ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గోశాలలో ఆవులకు సెమన్ అందిస్తున్నామని తెలిపారు.

దహన సంస్కారాల కష్టాలు తొలగించేందుకే 'స్వర్గారోహణం'

ప్రత్తిపాడు: శ్మశాన వాటికలో దహన సంస్కారాలకు గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను కొంతమేరైనా తగ్గించాలన్న ఆలోచనతోనే స్వర్గారోహణం మండపాన్ని నిర్మించినట్లు సురక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ పోశం ప్రగతి రెడ్డి తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని హిందూ శ్మశానవాటికలో దాతలు సుమారు రూ.16.5 లక్షలతో స్వర్గారోహణం మండపం, శివైక్యం భవనాలను నిర్మించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. దాతలు పోశం ప్రగతి రెడ్డి(గుంటూరు సురక్ష హాస్పిటల్) దహన సంస్కారాల మండపాన్ని, ప్రత్తిపాడుకు చెందిన బాపతు సాంబశివారెడ్డి, రజినీ దంపతులు శివైక్యం విశ్రాంతి భవనాన్ని, అస్థికల లాకర్‌ను గ్రామస్తుల సమక్షంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి రెడ్డి మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు స్వచ్ఛంధంగా ముందుకు రావడం వలనే ఇది సాధ్యమయ్యాయన్నారు. నేటి నుండి ప్రత్తిపాడు వాసులు మండపాన్ని వినియోగించుకోవచ్చని చెప్పారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన..

హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి పనుల్లో మరో కీలక అడుగు పడింది. శ్మశాన వాటికలో రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు మరో దాత స్పందన సంస్థల డైరెక్టర్ గంగిరెడ్డి పద్మజారెడ్డి ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.



భారీ వర్షానికి నీట మునిగిన రహదారులు

భారీ వర్షం.. రోడ్లు జలమయం

తెనాలిలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఏకధాటిగా రెండు గంటలకుపైగా వర్షం కురవడంతో వీధులు జలమయమయ్యాయి. అదేవిధంగా 33 కేవీ సబ్ స్టేషన్‌లో ఏర్పడిన సమస్యల కారణంగా తెనాలి పట్టణంలో అంధకారం నెలకొంది. సాయంత్రం సుమారు 6 గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోగా.. అర్ధరాత్రి వరకు పునరుద్ధరించలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. -తెనాలి అర్బన్





బహిరంగ ప్రాంతాల్లో మద్యం సేవిస్తే చర్యలు

తాడికొండ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన వారిపై చర్యలు తప్పవని తాడికొండ సీఐ కె.వాసు హెచ్చరించారు. ఆదివారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే యువకులకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే అల్లర్లు, వివాదాలకు దారితీస్తాయని యువత ఎక్కడా మద్యం సేవించవద్దని సూచించారు. ఈ సందర్భంగా పలువురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

శాలివాహన సంఘ కార్యవర్గం ఎన్నిక



ఫిరంగిపురం: తాడికొండ నియోజకవర్గ కుమ్మర శాలివాహన సంక్షేమ సంఘ సమావేశం మండలంలోని అల్లంవారిపాలెం ఆదివారం సాయంత్రం నిర్వహించారు. కుమ్మర శాలివాహన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పి. ఈశ్వర్, సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.శివన్నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాడికొండ నియోజకవర్గస్థాయి కుమ్మరశాలివాహన సంఘం అధ్యక్షుడిగా వి.నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె. చంద్రశేఖర్, కోశాధికారిగా ఎస్.కొండలు, కార్యవర్గసభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సంఘం మండల అధ్యక్షుడిగా ఎం.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా ఎస్.రమేష్‌లను ఎన్నుకున్నారు. వారికి నియామక పత్రాలను కార్పొరేషన్ చైర్మన్ పి.ఈశ్వర్ అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు, యువజన కమిటీ సభ్యులు, పట్టణ మహిళ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టపాసులు కాల్చొద్దు అన్నందుకు దాడి

మంగళగిరి టౌన్: ఇంటి ముందు టపాసులు కాల్చవద్దు అన్నందుకు తమపై దాడిచేశారని మంగళగిరి పీఎస్‌లో ఆదివారం జగన్నాథం శివకుమార్ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. జగన్నాథం శివకుమార్, భార్య, ఇద్దరు పిల్లలతో మంగళగిరి పట్టణ పరిధిలోని కొత్తపేట, బోరింగ్ సెంటర్ వద్ద రెండేళ్లుగా అద్దెకుంటున్నాడు. ఈ నెల 4వ తేదీ శనివారం రాత్రి 8 గంటల సమయంలో తమ ఇంటి ఎదురు పిల్లలు టపాకాయలు కాలుస్తూ పెద్ద శబ్దాలు చేస్తూ గోల చేస్తున్నారు. శబ్దాలు చేయకండి అని, ఇక్కడి నుంచి వెళ్లమని శివకుమార్ భార్య ఆ పిల్లలతో చెప్పబోతున్నారు. ఈ లోపే ఆ పిల్లల తల్లులు వచ్చి మా పిల్లలు ఇలానే చేస్తారు, ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ ఆమెను తిట్టారు. ఎందుకు తిడుతున్నారని శివకుమార్ వారిని ప్రశ్నించడంతో ఇద్దరిపై దాడిచేశారని, శివకుమార్‌కు, అతని భార్యకు గాయాలయ్యాయి. చినకాకానిలో ఉన్న ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమపై దాడి చేసి, కులం పేరుతో తిట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శివకుమార్ కోరారు.

పరిపూర్ణ వ్యక్తిత్వానికి ఎన్‌సీసీ దోహదం

గుంటూరు రూరల్: ప్రాథమిక సైనిక శిక్షణ అందిస్తూ సమాజంపై వారికి ఉన్న బాధ్యతను నెరవేర్చే విధంగా విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవర్చేందుకు నేషనల్ క్యాడెట్ క్యాంప్ తోడ్పడుతుందని ఏపీ ట్రెక్ ట్రెక్ మేనేజర్ కల్నల్ సుదాన్స్ దుబే తెలిపారు. గత వారం రోజులుగా మండలంలోని చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థులకు ఏపీ ట్రెక్ అండ్ ట్రెక్ క్యాంప్ నిర్వహించారు. ఆదివారం క్యాంప్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రెక్ మేనేజర్ ఏపీ ట్రెక్ కల్నల్ సుదాన్స్ దుబే మాట్లాడుతూ ఏపీ తెలంగాణ డైరెక్టరేట్‌లోని 9 గ్రూపులకు సంబంధించిన 510 మంది ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ ట్రెక్ క్యాంపులో కోటప్పకొండ, కొండవీడు, విజయవాడ కొండపల్లి ప్రాంతాలలో ఎన్‌సీసీ క్యాడేట్స్ ట్రెకింగ్ నిర్వహించారని చెప్పారు. భారతదేశంలో 1948లో ఎన్‌సీసీ ఏర్పడిందని ఆర్మీలో సిబ్బంది కొరతను తీర్చే లక్ష్యంతో ఇండియన్ డిఫెన్స్ యాక్ట్ 1917లో దీనిని రూపొందించడం జరిగిందన్నారు. పాఠశాల స్థాయి నుంచి కళాశాలలో చదివే వివిధ రకాల విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ అందిస్తారని తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలి

సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి నేతాజీ



పేదలతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గంలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు, పట్టాలు మంజూరు చేయాలని సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులతో కలసి పుష్కర కాలనీ, సీతానగరం వద్ద ప్ల కార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు మంగళగిరి నియోజకవర్గ పరిధిలో రైల్వే, కొండ పోరంబోకు, ఇరిగేషన్ తదితరప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న పేదలకు ఇళ్లపట్టాలు, ఇంటి స్థలం లేని వారికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాడేపల్లిలోని పోతురాజు స్వామి గుడి, రన్నింగ్‌రూమ్ సెంటర్ తదితర ప్రాంతాల్లో సీపీఎం కార్యకర్తలతో కలసి పాదయాత్ర నిర్వహించి దరఖాస్తులు పంపిణీ చేశారు. ఈనెల 17వ తేదీ మంగళగిరిలోని ఎంటీఎంసీ కార్యాలయం వద్ద పేదలందరు దరఖాస్తులతో తరలి రావాలని పిలుపునిచ్చారు. 2016లో కృష్ణా పుష్కరాల సందర్భంగా సీతానగరంలో 500 మంది పేదల ఇళ్లు తొలగించారని, ఆనాడు ఇచ్చిన హామీ నేటికీ నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే గతంలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో అర్హులైన పేదలకు రెండు సెంట్ల స్థలం, గ్రామాల్లోని అర్హులన పేదలకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఇళ్ల స్థలాల సాధనకు ఈ నెల మూడవ తేదీ నుంచి పేదల పేటలో పాదయాత్రలు, కార్యక్రమాలు, పేదలకు అర్జీలు ఇవ్వడం జరుగుతోందన్నారు. 13,14,15 తేదీల్లో ఎంటీఎంసీ కార్యాలయం ఎదుట దీక్షలు, 17వ తేదీ ఇంటి స్థలాలకు, పట్టాలకు అర్హులైన వారందరితో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, గాదే సుబ్బారెడ్డి, మేరీ, కోట బాబూరావు, దర్శనపు విజయబాబు, అంజిరెడ్డి, సుభాని, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

పద్ధతి మారకపోతే పీడీ యాక్ట్



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న మంగళగిరి ఎస్ఐ రవీంద్రనాయక్

మంగళగిరి టౌన్: రౌడీషీటర్లు ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని లేకుంటే పీడీ యాక్ట్ అమలు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని మంగళగిరి ఎస్ఐ రవీంద్రనాయక్ హెచ్చరించారు. మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్రనాయక్ మాట్లాడుతూ రౌడీషీటర్లు సన్మార్గంలో నడవాలని, కేసుల పాలుకాకుండా కుటుంబ సభ్యులతో కలసి సంతోషంగా జీవించాలన్నారు. అల్లర్లకు, సెటిల్‌మెంట్లకు, గొడవలకు దూరంగా ఉండాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇవ్వడం నిరంతర ప్రక్రియ అని, ప్రతి ఆదివారం కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు. సత్ప్రవర్తనతో మెలిగే వారిపై రౌడీషీట్లు తొలగించేందుకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో క్రైంసిబ్బంది ఏడుకొండలు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర పోరాట దీప్తి కల్లూరి



తులసమ్మ విగ్రహం వద్ద నివాళి

తెనాలి: రూరల్ మండల గ్రామం పెదరావూరులో ప్రముఖ స్వాతంత్ర్యయోధురాలు కల్లూరి తులశమ్మ 24వ వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గల తులసమ్మ కాంస్య విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆమె చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య మాట్లాడుతూ గాంధీజీ పిలుపుతో కల్లూరి తులసమ్మ ఒంటిపైనున్న బంగారు నగలను విరాళంగా ఇవ్వటమే కాకుండా, స్వాతంత్ర్య ఉద్యమానికి అవరోధం కలుగుతుందనే భావనతో భర్తను ఒప్పించి, ఆయనకు స్వయంగా మారుమనువు చేసి మరీ స్వరాజ్య పోరాటంలో పాల్గొన్నట్టు చెప్పారు. జైలులో కూడా తన ఉద్యమాన్ని కొనసాగించి, మరింత జైలుశిక్షను అనుభవించిన పోరాట యోధురాలు తులసమ్మ అన్నారు. స్వాతంత్రం సిద్ధించిన తర్వాత కూడా జీవితాంతం నిరాడంబర జీవనం, ఖాదీ ప్రచారం, ఖాదీవస్త్రాల అమ్మకంతో జీవనం సాగించినట్టు గుర్తుచేశారు. అలాంటి త్యాగధనులను నేటితరం గుర్తుచేసుకుని, స్ఫూర్తిని పొందాలని సూచించారు. శాఖమూరి తిమ్మానాయుడు, పాలడుగు సురేంద్ర, కొడాలి పూర్ణచంద్రరావు, గోగినేని కిశోర్‌బాబు పాల్గొన్నారు.

8 నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లు

తెనాలిఅర్బన్: తపాలా శాఖ ఆధ్వర్యంలో తెనాలి డివిజన్ పరిదిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 8 నుంచి 14 వరకు ఆధార్ క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ జీవీ బాలసరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి సేవలను ఉచితంగా అందిస్తారని పేర్కొన్నారు. 8,9 తేదీల్లో తెనాలి దేవి చౌక్‌లోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో, 10, 11 తేదీల్లో బాపట్ల జిల్లా, కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో, 13,14 తేదీల్లో తెనాలి రైల్వే స్టేషన్‌రోడ్డులోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాలలో క్యాంపులు జరుగుతాయని తెలిపారు.

లక్ష్మీనారాయణకు సన్మానం

తెనాలిఅర్బన్: వడ్లమూడిలోని బాలకోటేశ్వర స్వామి ఆలయ కమిటీ చైర్మన్ అనంత లక్ష్మీనారాయణను గౌడ సంఘ నాయకులు తెనాలిలో ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా చైర్మన్‌గా ఎన్నికైన ఆయనను అభినందించి మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. వీరంకి రంగారావు, గీతబంధు సేవా సమితి ట్రస్ట్ చైర్మన్ తుళ్లూరు శ్రీనివాసరావు, జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చెన్ను శ్రీనివాసరావు, రాష్ట్ర గౌడ సంఘ నాయకులు బెల్లంకొండ సురేష్, పట్టణ గౌడ సంఘ అధ్యక్షుడు కుంభం బాలాజీ, నియోజకవర్గ కన్వీనర్ గిరి గణేష్ తదితరులు పాల్గొన్నారు.